క్లుప్తంగా

నేడు ఆండాళ్ తిరువడిపురం ఉత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీగోవింద రాజస్వామి వారి ఆలయంలో ఈనెల 7వ తేదీ బుధవారం శ్రీఆండాళ్ అమ్మవారి తిరువడి పురం ఉత్సవం ఘనంగా జరుగనుంది. శ్రీఆండాళ్ అమ్మవారి శాత్తుమొర సందర్భంగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీగోవిందరాజస్వామివారు, శ్రీఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీగోవిందరాజస్వామి వారు, శ్రీఆండాళ్ అమ్మవారిని అలిపిరికి ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ఆస్థానం నిర్వహిస్తారు. ప్రత్యేక పూజల అనంతరం అలిపిరి నుంచి రామనగర్ క్వార్టర్స్ గీతా మందిరం, ఆర్ఎస్ మాడవీధిలోని వైఖానచార్యుల వారి ఆల్యం, చిన్నజీయర్ మఠం మీదుగా ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. రాత్రి 8 గంటలకు శ్రీఆండాళ్ అమ్మవారి సన్నిధిలో శాత్తుమొర నిర్వహిస్తారు.

తిరుమల లడ్డూ కౌంటర్లలో తనిఖీలు



లడ్డూ కౌంటర్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల: తిరుమలలోని లడ్డూ కాంప్లెక్స్‌ను మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి పరిశీలించారు. పోటు పేష్కార్ శ్రీనివాసులుతో పాటు అడిషనల్ ఈఓ లడ్డూ కాంప్లెక్స్‌ను సందర్శించి దర్శనం టిక్కెట్లపై కౌంటర్లలో లడ్డూలు జారీ చేసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం లడ్డూ ప్రసాదాల తయారీకి సంబంధించిన ముడిసరుకుల నిల్వ ఉన్న ఉగ్రాణం కూడా పరిశీలించారు. కార్యక్రమంలో వీజీఓ శ్రీనందకిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ ఏర్పాటుకు పరిశీలన



శానంబట్ల వద్ద రీచ్ ఏర్పాటు కోసం పరిశీలిస్తున్న అధికారులు

చంద్రగిరి: మండలంలో ఇసుక రీచ్‌ల ఏర్పాటు కోసం అధికారుల బృందం మంగళవారం పలు ప్రాంతాలను పరిశీలించింది. స్థానిక రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఈబీ, ఈఓపీఆర్డీతో కలసి బృందం సభ్యులు మండల పరిధిలోని శానంబట్ల, నాగయ్యగారిపల్లి వద్ద ఉన్న స్వర్ణముఖినదిని పరిశీలించారు. శానంబట్ల వద్ద ఉన్న స్వర్ణముఖినదిలో బావులు ఏర్పడడంతో నాగయ్యగారిపల్లి వద్ద చూశారు. ఈ మేరకు తుది నివేదికను ప్రభుత్వానికి పంపిచనున్నట్లు అధికారులు, ప్రభుత్వ నిర్ణయంతో రీచ్‌ల ఏర్పాటుపై ఒక స్పష్టత వస్తుందన్నారు.

నూతన కమిటీ ఎంపిక

  

కె.మల్లికార్జున, భజంత్రీ మల్లికార్జున, పి.మునిబాలకుమార్

తిరుపతి కల్చరల్: నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈమేరకు మంగళవారం అన్నారావు సర్కిల్‌లోని ఓ ప్రైవేటు సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.మల్లిఖార్జున, ప్రధాన కార్యదర్శిగా భజంత్రీ మల్లికార్జున, గౌరవాధ్యక్షుడుగా పి.మునిబాలకుమార్, అలాగే గౌరవాధ్యక్షురాలిగా రాధాదేవి, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ, కోశాధికారిగా కామరాజు, సహాయ కార్యదర్శిగా డి.చంద్రమోహన్‌తో పాటు 36 మంది కమిటీ సభ్యులను ఎన్నికయ్యారు.

గద్దర్ సంస్మరణ సభ

పాకాల : స్థానిక విద్యావనరుల కేంద్రంలో గద్దర్ సంస్మరణ సభను జిల్లా విరసం సభ్యులు, ప్రముఖ ప్రజాకవి, ఎంఈఓ బాబ్జీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గద్దర్ మన మధ్య లేకున్నా ఆయన రచనలు, పాటల ద్వారా ఎప్పటికీ మన మధ్యనే ఉంటారని తెలిపారు.

ఇస్కాన్ భోజనం వద్దు

తిరుపతి తుడా : మున్సిపల్ పాఠశాలల్లో ఇస్కాన్ సరఫరా చేస్తున్న ఆహారం నిలిపివేసి డొక్కా సీతమ్మ భోజన పథకం అమలు చేయాలి ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు కమిషనర్ మౌర్యకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఇస్కాన్ యాజమాన్యం మధ్యాహ్నం 12.30కు పంపించాల్సిన భోజనాన్ని ఉదయం 6గంటలకే పాఠశాలలకు చేర్చడం దారుణమన్నారు. దీంతో భోజనం పాడయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు. ఇస్కాన్ వారు నాసిరకం ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాల వినోద్, నరేంద్ర, అక్బర్ పాల్గొన్నారు.

తాగునీరు ఇప్పించండి మహాప్రభో

- మోటారు స్టార్టరు గదికి తాళం వేసిన టీడీపీ నేతలు
- ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్న దళితులు
- అయినా కనికరించని అధికారులు
- జాతర వేళ గుక్కెడు నీటి కోసం మాదిగపల్లె దళితుల పాట్లు



టీడీపీ నేతలు తాళం వేసిన మోటారు స్టార్టర్ ఉన్న గది వద్ద గ్రామస్తులు



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న దళితులు

భాకరాపేట : ''గుక్కెడు తాగునీళ్లు ఇప్పించండి మహాప్రభో'' అంటూ దళితులు ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినా అధికారుల మనసు కరగడం లేదు. నాలుగు రోజులుగా చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ మాదిగపల్లెకు నీటి సరఫరా చేసే మోటారు స్టార్టర్ గదికి టీడీపీ నేతలు తాళం వేశారు. దీంతో గ్రామంలో జరుగుతున్న మాతమ్మ జాతరకు పంచాయతీ ఆధ్వర్యంలో రెండు ట్యాంకర్లు పెట్టి నీటిని అందించారు. ఈ విషయంపై మాదిగపల్లె గ్రామస్తులు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదంటూ వాపోతున్నారు. ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డిని కలసి తాగునీటికి వేసిన తాళం తీయించాలని ఖాళీ బిందెలతో సోమవారం నిరసన తెలిపారు. మంగళవారం ఉదయం తాళం తీయిస్తానని ఎంపీడీఓ హామీ ఇవ్వడంతో నిరసన కార్యక్రమాన్ని విరమించారు.

మీకెందుకయ్యా అంటూ దళితులపైనే ఆగ్రహం

ఇది ఇలా ఉంటే మంగళవారం మోటారు స్టార్టరు ఉన్న గదికి తాళం తీయకపోగా భాకరాపేట పోలీసుల నుంచి గ్రామ పెద్దలపై ఫిర్యాదు అందింది. దీంతో దళితులు ఎంపీడీఓను కలిశారు. ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి దళితులను ఉద్దేశించి మాట్లాడుతూ ''ఏమయ్యా మీరు తాళం ఇస్తామంటే తీసుకోకుండా.. ఎవరు వేశారో వారే వచ్చి తీయాలని తిరుగుబాటు చేస్తారట.. మీకెందుకయ్యా'' అని ప్రశ్నించినట్లు చెబుతున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన దళితులకు అక్కడా న్యాయం జరగకపోవడంతో దిక్కుతోచని స్థితిలో గ్రామానికి చేరుకున్నారు. గ్రామపెద్దలు ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా.. ఏనాడు మా గ్రామానికి ఈ దుస్థితి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాము మానవ హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ముందస్తు జాగ్రత్తలతో సంపూర్ణ ఆరోగ్యం

- రెండో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోటేశ్వరరావు



మాట్లాడుతున్న జడ్జి కోటేశ్వరరావు

తిరుపతి కల్చరల్: దైనందిన జీవితంలో ఆరోగ్య సమస్యలు సహజమేనని, ముందస్తు జాగ్రత్తలు, పరీక్షల కారణంగా ఆరోగ్యం సంపూర్ణంగా ఉంటుందని రెండవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోటేశ్వరరావు తెలిపారు. రాస్ మహిళా పొదుపు సంఘాల సభ్యుల సౌకర్యార్థం రాస్, అమర ఆస్పత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రాస్ కార్యాలయంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా, ధ్యానం చేయడం ద్వారా మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందని తెలిపారు. రాస్ సేవలు పాదర్శకంగా ఉంటాయని కొనియాడారు. అనంతరం రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడగుతూ రాస్ ద్వారా పట్టణాలు, పల్లెల్లో వైద్యశిబిరాలు, వృత్తిశిక్షణలు, విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వయసు రీత్యా వచ్చే ఆరోగ్య సమస్యలకు సరైన సమయంలో వైద్యం తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, వీల్ చైర్లను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటశివకృష్ణ, డాక్టర్ భానుప్రదీప్, డాక్టర్ అశోక్‌రెడ్డి, రాస్ డైరెక్టర్ నాగరాజు, డాక్టర్ శివస్వాతి పాల్గొన్నారు.

ముర్రుపాలతో ఆరోగ్యం

చంద్రగిరి: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలను పట్టించడం ద్వారా బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంఆర్‌హెచ్‌ఆర్‌యు శాస్త్రవేత్తలు డాక్టర్ యువీ ప్రసాద్, డాక్టర్ వెన్నెల సాహితి అన్నారు. మంగళవారం స్థానిక జమండ్ల వీధిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ప్రదీపతో కలసి వారు తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే పట్టించాలన్నారు. సీడీపీఓ ప్రదీప మాట్లాడుతూ పుట్టిన బిడ్డ సంరక్షణ కోసం వైద్యుల సలహాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమణి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆశాలతాదేవి, కుసుమ, మునిజ్యోతి, గీత తదితరులు పాల్గొన్నారు.

లింగేశ్వర నగర్‌లో చోరీ

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం లింగేశ్వరనగర్ పంచాయతీలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే రామయ్య భార్య సోమవారం రాత్రి తన పిల్లలను ట్యూషన్ నుంచి తీసుకువచ్చేందుకు బయటకు వెళ్లింది. 25 నిమిషాల్లో ఆమె తిరిగి వచ్చే సరికి బీరువా తాళం తీసి ఉంది. వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉండాల్సిన 118 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో వెంటనే ఆమె తన భర్త రామయ్యకు సమాచారం అందించింది. రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తిరుపతి రూరల్ ఎస్ఐ షేక్ షావలీ తెలిపారు. దీనికి సంబంధించి ఓ అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

రిజిస్ట్రేషన్లకు గడువు ఇవ్వండి

తిరుపతి మంగళం: తిరుపతి నగర పరిధిలో క్లినికల్ ల్యాబ్‌లను నిర్వహిస్తున్న వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకునేందుకు గడువు కావాలని తిరుపతి మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం తిరుపతి అర్బన్ మండ లం మంగళంలోని పీహెచ్‌సీ వైద్యాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా క్వాలిఫైడ్ ల్యాబ్ టెక్నీషియన్లేనని, తమకు పారామెడికల్ రిజిస్ట్రేషన్ ఉందన్నారు. అయి తే డీఎమ్అండ్‌హెచ్ఓ సర్టిఫికేషన్‌తో పాటు ఫైర్, వేస్ట్ మేనేజ్‌మెంటుకు సంబంధించిన అనుమతులు, జిల్లా అధికారులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. అనుమతులు వచ్చేవరకు తమకు త మ ల్యాబ్‌లను నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకు సంబంధించిన వినతిపత్రం డీఎంఅండ్ హెచ్ఓకు కూడా ఇచ్చామని చెప్పారు.

మున్సిపల్ వాహనం - బస్సు ఢీ



శ్రీనివాస సేతుపై దుమ్ము ధూళిని తొలగిస్తున్న మున్సిపల్ వాహనాన్ని బస్టాండ్ నుంచి కపిలతీర్థం మీదుగా రాయచోటి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనదంతో స్వల్ప ప్రమాదం చోటు చేసుకుంది. దీతంఓ శ్రీనివాస సేతుపై సుమారు గంటసేపు రాకపోకలు స్తంభించాయి. ఆ చిత్రాలను సాక్షి కెమెరా బంధించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

వ్యర్థాలపై కఠినంగా వ్యవహరించండి



రోడ్డుపై పారబోసిన భవన వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి తుడా : భవన నిర్మాణ వ్యర్థాలను ఇక నుంచి ఎక్కడపడితే అక్కడ పారబోస్తే తీవ్ర చర్యలు ఉంటాయని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్. మౌర్య హెచ్చరించారు. ఖాళీ స్థలాల్లో చెత్త డంపింగ్, రోడ్లకు ఇరువైపులా భవన నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయి ఉండడంపై సాక్షి ఇటీవల ఫోకస్ చేసింది. దీనిపై స్పందించిన కమిషనర్ భవన వ్యర్థాలపై అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా మంగళవారం ఆమె ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఖాళీ స్థలాలు విలాసవంతమైన రోడ్లకు ఇరువైపులా భవన నిర్మాణ వ్యర్థాలు, కొబ్బరి చిప్పలు డంపింగ్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సమాచారం లేకుండా వ్యక్తిగతంగా వ్యర్థాలను తరలించే వారిపై ప్లానింగ్ సెక్రటరీలు దృష్టి సారించాలని సూచించారు. వ్యర్థాలను తరలించే ట్రాక్టర్లు, టిప్పర్లను గుర్తించి భారీ ఎత్తున జరిమానా విధించాలని ఆదేశించారు.

ఫ్లెక్సీలకు అనుమతులు ఉన్నాయా ?

తిరుపతి నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు లేకుండా ఎవరైనా ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. నగర సుందరీకరణకు ఆటంకం కలిగించే వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆమె చెప్పారు. అధికారులతో కలిసి మంగళవారం కమిషనర్ ఎన్.మౌర్య నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఉండడంపై కమిషనర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నగరంలో ప్లాస్టిక్ కవర్లు, గోతాల్లో చెత్తను రోడ్లపై వేస్తున్నారని, అలాంటి దుకాణదారులను గుర్తించి జరిమానాలు విధిస్తామన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈలు విజయకుమార్ రెడ్డి, శ్రావణి, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు ఉన్నారు.

నగర శుభ్రతకు పెద్దపీట

నగరం పరిశుభ్రంగా ఉండేందుకు పెద్దపీట వేస్తున్నామని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. వినాయక సాగర్ ఆహ్లాదంగా, శుభ్రంగా ఉంచుతామని, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నగరంలో ఎక్కడా వర్షపు నీరు నిలవకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించామని అన్నారు.

ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సహకరించండి



కేంద్రమంత్రికి శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న పీసీ రాయల్

తిరుపతి కల్చరల్: తిరుపతి ఎయిర్‌పోర్టు అభివృద్ధికి సహకరించాలని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్, ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్ డాక్టర్ పీసీ రాయల్ మంగళవారం కేంద్రమంత్రి మురళీధర్ మోహోల్‌ను కోరారు. మంగళవారం ఢిల్లీలో సివిల్ ఏవియేషన్ యూనియన్ మినిస్టర్ మురళీధర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శ్రీవారి ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి ఎయిర్‌పోర్టు అభివృద్ధిపై ప్రత్యేకంగా చర్చించామని తెలిపారు. తనవంతు సహాయసహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా కేంద్రమంత్రి హామీ ఇచ్చారని చెప్పారు.

ప్రేమ వ్యవహారంలో ఇరువర్గాల ఘర్షణ



ప్రమాదంలో గాయపడిన లోకేష్

తిరుపతి క్రైమ్: ప్రేమ వ్యవహారంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. తిరుపతి డీఎస్పీ రవి మనోహరాచారి తెలిపిన వివరాల మేరకు.. రైల్వే కాలనీ సమీపంలో ఉన్న సుందరయ్య నగర్‌లో నివాసం ఉంటున్న బాలు (21) చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే వీరి సమీపంలోనే నివాసం ఉంటున్న ఓ మైనర్ బాలికతో ప్రేమలో పడ్డాడు. అయితే వీరు తరచూ మాట్లాడుకోవడాన్ని వారి పెద్దలు చూసి పలుమార్లు మందలించారు. బాలు కుటుంబీకులతో ఇదే క్రమంలో మంగళవారం మైనర్ బాలిక సోదరుడైన మైనర్ బాలుడు గొడవపడ్డాడు. ఈ ఘర్షణలో బాలు అన్న లోకేష్‌కు, మైనర్ బాలిక మేనమామ సురేష్‌కు కత్తితో గాయాలయ్యాయి. ప్రస్తుతం వీరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 63,094 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 23,127 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.72 కోట్లు ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందు వచ్చిన భక్తులను క్యూలోకి అనుమతించమని వెల్లడించింది.

రైతు సమస్యల పరిష్కారానికి వినతి

తిరుపతి కల్చరల్ : రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి ఆదుకోవాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మోహన్‌బాబు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. రైతులకు రాయితీపై నాణ్యమైన విత్తనాలు, కౌలు రైతులకు పంట రుణాలు, సాగునీటి సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే నీటి ప్రాజెక్టులను, కాలువల మరమ్మతులు చేపట్టి వ్యవసాయాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందించినట్లు వెల్లడించారు. సమావేశంలో కిసాన్ మోర్చా ప్రతినిధులు సుబ్బారెడ్డి, ప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి కుంభాభిషేక వేడుకలు

 

సహస్ర కలశాభిషేకం కోసం ఆలయానికి చేరిన కలశాలు, కుంభాభిషేకం కోసం ఏర్పాటు చేసిన యాగశాల

చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవతగా పూజలందుకుంటున్న శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారి ఆలయ కుంభాభిషేక మహోత్సవాన్ని బుధవారం నుంచి మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లతో పాటు ప్రత్యేకంగా యాగశాలను సైతం ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 9 గంటలకు యాగశాల ప్రదక్షిణ, భూతబలిహరణ, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య మండపారాధన, సాయంత్రం 4.30 గంటలకు మృత్స్యంగ్రహణ, అంకురార్పణ, అగ్నిప్రతిష్ట, ఆవరణ హోమం, మూలమంత్ర హోమాలు, చండీ హోమాలను నిర్వహించనున్నారు. గురువారం కూడా ఆలయంలో పూజలు జరుగుతాయి. చివరి రోజు శుక్రవారం తెల్లవారుజామున 5.50 గంటలకు గణపతి పూజ, పంచగవ్య, మూర్జనలు, యంత్ర శిఖర ప్రతిష్ట సహిత సహా కుంభాభిషేకం, మూల మంత్ర హోమం, మహాపూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ హోం సైన్స్, న్యూట్రీషియన్ అండ్ హెల్త్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థినులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిశువులు, తల్లుల ఆరోగ్యం, శ్రేయస్సులో తల్లిపాల పాత్రపై రచనలు, పోస్టర్ మేకింగ్ పోటీలను నిర్వహించారు. విద్యార్థినులు తమ సృజనాత్మకతతో నవజాత శిశువులకు తల్లిపాల అవసరంపై ప్రత్యేక థీమ్‌లు, నినాదాలు, పోస్టర్ మేకింగ్‌లో ప్రతిభ చూపారు. కార్యక్రమంలో హోంసైన్స్, ఎన్ఎస్ఎస్ అధికారులు, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

9న ఢిల్లీలో ధర్నా



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజు గౌడ్

తిరుపతి కల్చరల్: బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో చేపట్టే ధర్నాకు జిల్లాలోని బీసీలంతా తరలివచ్చి జయప్రదం చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి బీసీ కులగణనను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో బీసీలు అన్నివిధాలా తీవ్రస్థాయిలో నష్టపోతున్నారని తెలిపారు. ఈమేరకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్‌రావు పిలుపు మేరకు ఢిల్లీలో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా నుంచి సుమారు 250 మంది బీసీ నేతలు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్, ప్రతినిధులు మధుఆచారి, జగదీష్ పాల్గొన్నారు.

9 నుంచి 'రంగస్థలి' కళోత్సవాలు



కోనేటి సుబ్బరాజును సత్కరిస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్ : తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు శాస్త్రీయ, జానపద నృత్య కళోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు రాయలసీమ రంగస్థలి కార్యదర్శి కేఎస్ రాజా తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కళోత్సవ నృత్య పోటీలు ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వందలాది మంది కళాకారులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. అలాగే శ్రీకృష్ణ దేవరాయ కళా దర్బార్ పేరుతో నిర్వహించే సమావేశానికి పలువురు ప్రముఖులు హాజరై రాయలవారి పాలన వైభవాన్ని, విశిష్టతను వివరిస్తారని తెలిపారు. సంగీత, సాహిత్యం వంటి సేవా రంగాలలో నిష్ణాతులను శ్రీకృష్ణదేవరాయ పురస్కారాలతో సత్కరించనున్నట్లు చెప్పారు. విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికలను అందజేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ప్రతినిధులు కొత్తపల్లి మునిరత్నం, జగన్నాథం, సుబ్రమణ్యంరెడ్డి, రామారావు, చెంగారెడ్డి పాల్గొన్నారు.

ఆవుదూడ మృతి

- గుర్తు తెలియని జంతువు దాడి
- చిరుతపులే అంటున్న గ్రామస్తులు
- పాదముద్రలు సేకరించిన అటవీ అధికారులు



సంఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఫారెస్టు బీట్ అధికారి కిషోర్‌కుమార్

రామచంద్రాపురం: మండలంలోని పరమాల అటవీప్రాంత సమీపంలో గల పొలం వద్ద ఆవుదూడ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పరమాల గ్రామానికి చెందిన శేషమ్మ అటవీ సమీపంలో గల తన పొలం వద్ద సోమవారం రాత్రి ఆవులను కట్టేసి మేత పెట్టి ఇంటికి వెళ్లింది. మంగళవారం ఉదయం వచ్చి చూడగా గుర్తు తెలియని జంతువు ఆవుదూడను చంపి సగానికి పైగా తిని వదిలేసినట్లు గుర్తించింది. వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని చిరుతపులి ఏమైనా దాడి చేసిందా ? అన్న అనుమానంతో ఫారెస్టు బీట్ అధికారి కిషోర్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని జంతువు పాదముద్రలను సేకరించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ల్యాబ్‌లో పరిశీలించి దాడికి పాల్పడింది చిరుతా లేక రేసు కుక్కలా అనేది తెలుస్తుందన్నారు.

బళ్లారి రాఘవ అవార్డు గ్రహీతకు సత్కారం



కోనేటి సుబ్బరాజును సత్కరిస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్: విశ్వనట చక్రవర్తి రంగస్థల రత్నం బళ్లారి రాఘవ జాతీయ అవార్డు గ్రహీత ఎస్వీ నాట్య కళాపరిషత్ కార్యదర్శి కోనేటి సుబ్బరాజును తిరుపతి కళాకారులు మంగళవారం ఘనంగా సత్కరించి అభినందించారు. కళాకారుడుగా, కళాపోషకుడుగా కోనేటి సుబ్బరాజు శ్రీనివాస కల్యాణం, పార్వతి కల్యాణం, నర్తనశాల, అహో ఆంధ్రభోజ, షిర్డీ సాయిబాబా మహత్యం, లవకుశ, మాయా బజార్, దానవీరశూరకర్ణ వంటి నాటకాలను అద్భుత సెట్టింగ్‌ల మధ్య సుమారు 60 మంది కళాకారుల బృందంతో దేశవ్యాప్తంగా నాటకాలు ప్రదర్శించి నాటక కళలతో పాటు కళాకారులను ప్రోత్సహిస్తూ కళామతల్లికి అందిస్తున్న సేవలను గుర్తించి బళ్లారి రాఘవ మెమోరియల్ ట్రస్ట్ ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు బళ్లారి రాఘవ జయంతి సందర్భంగా నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయనను బళ్లారి రాఘవ జాతీయ అవార్డుతో ఘనంగా సత్కరించి అభినందించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో కోనేటి సుబ్బరాజు ఈ ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడంతో తిరుపతి కళాకారులు ఎస్వీ నాట్య కళాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కళాకారులు బొందు రామచంద్రారెడ్డి, ఆమూరి సుబ్రమణ్యం, శాంబోలు హరినాథ్, గోపాల్‌రావు, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, చంద్రారెడ్డి, విజయబాబు, మునిసుబ్రమణ్యం పాల్గొన్నారు.

బలిజలకు రాజకీయ అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న గ్రేటర్ రాయలసీమ బలిజ మహాసభ కన్వీనర్ శివప్రసాద్

తిరుపతి కల్చరల్: గత ఎన్నికల్లో కూటమి విజయానికి నిరంతరం కృషి చేసిన బలిజ సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవులు కల్పించి వారికి రాజకీయ అవకాశాలు కల్పించాలని గ్రేటర్ రాయలసీమ బలిజ మహాసభ శివప్రసాద్, ఆర్కాట్ కృష్ణప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గత ఎన్నికల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొని, దాడులు, అక్రమ కేసులు వంటి సమస్యలు ఎదుర్కొంటూ బలిజ సామాజికవర్గం ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందన్నారు. అంతేకాక రాష్ట్రంలో రాజకీయ మార్పు కోసం బలిజ సామాజికవర్గం గట్టిగా నిలబడిందని తెలిపారు. గ్రేటర్ రాయలసీమలోని 6 ఉమ్మడి జిల్లాలతో పాటు మిగిలిన జిల్లాల్లో బలిజ సామాజికవర్గం సుమారు రూ.40 లక్షలకు పైగా జనాభా కలిగి ఉందన్నారు. ప్రతి జిల్లాలో బలిజలకు జనాభా ప్రకారం నామినేటెడ్ పదవులు కల్పించాలన్నారు. సమావేశంలో గ్రేటర్ రాయలసీమ బలిజ మహాసభ ప్రతినిధులు రామ్‌దాస్, బాలాజి, ఆరణి తులసి, రాము, జీవీ ప్రసాద్, నీలకంఠం, చక్రధర్, పొనగంటి భాస్కర్, డాక్టర్ కరుణానిధి పాల్గొన్నారు.